సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 16 । మార్చి । 2023



న్యాయ కళాశాలకు గుర్తింపు

జీఆర్ఏయూ లా కాలేజీకి బీసీఐ గుర్తింపు లభించింది. ప్రవేశాలకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- 8లో



బిల్లు లేకపోతే..

వస్తువు కొన్నప్పుడు బిల్లు తీసుకోవాలని, లేకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోతామని పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్ అన్నారు.

- 8లో

ఉచితంగా ఉపాధి శిక్షణ కోర్సు

టెక్కలి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా ఉపాధి కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి పి.బి.సాయిశ్రీనివాస్, ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం తెలిపారు. కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ కోర్సుల్లో చేరేందుకు టెన్త్, ఆ పైన విద్యార్హతలు కలిగిన 18–30 ఏళ్ల లోపు అభ్యర్థులు ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

కౌంటింగ్ భిన్నం.. అందుకే ఆలస్యం!



స్వర్ణభారతి స్టేడియంలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ డా.మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు విశాఖపట్నంలో గురువారం ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు గురువారం అర్ధరాత్రికి పూర్తవుతుందని అంచనా. మొత్తం 28 టేబుల్స్‌ను లెక్కింపునకు ఏర్పాటు చేశారు. 560 మంది సిబ్బందిని నియమించగా.. వీరికి ఒక్కో షిఫ్ట్‌కు 280 మంది చొప్పున విధులను కేటాయించారు. వీరితో పాటు సహాయకులుగా మరో 50 మందికి పైగా సిబ్బంది, అధికారులు కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటివరకు 280 మంది ఏజెంట్లకు పాస్‌లు జారీచేశారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో ప్రాధాన్యత అంకెల ప్రాతిపదికన రౌండ్లు ఉంటాయి. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయితే మొదటి రౌండ్ పూర్తయినట్లు పరిగణిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కావాల్సిన కోటా ఓట్లు ఎన్ని అనేది తేలుతుంది. తొలి రౌండ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎవరికెన్ని వచ్చాయనేది నిర్ధారిస్తారు. చెల్లని ఓట్లను పక్కన పడేస్తారు. చెల్లినవాటిలో 50 శాతం ఓట్లకు ఒకటి కలిపితే ఎన్ని ఓట్లవుతాయో.. దాన్నే కోటా(అభ్యర్థి గెలుపునకు కావాల్సిన ఓట్లు)గా నిర్ధారిస్తారు. మొత్తం 2,00,926 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లుపోగా మిగిలిన వాటిలో 50 శాతానికి, ఒక ఓటును అదనంగా కలుపుతారు. ఆ లెక్క మేరకు ఎవరికైతే అన్ని ఓట్లు వస్తాయో వారిని విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఆ సంఖ్యకు ఎవరూ చేరుకోకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అప్పుడు బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి.. ఆ వ్యక్తికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను గణిస్తారు. ఈ విధంగా కోటా ఓట్లు వచ్చే వరకు అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ.. లెక్కింపును కొనసాగిస్తారు. చివరికి ఇద్దరు అభ్యర్థులు మిగిలే వరకు కోటా ఓట్లను చేరుకోకపోతే.. అపుడు ఆ ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చాయో.. వారినే విజేతగా ప్రకటించి, కౌంటింగ్ నిలుపుదల చేస్తారు. ఈ కారణంగా ఫలితం వచ్చే సరికి చాలా ఆలస్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

స్థానికంపై స్పష్టత..

రెండోదానిపైనే ఉత్కంఠ



ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ గురువారం ఉదయం మొదలు కానుంది. జిల్లా పరిధిలో రెండు స్థానాలకు ఎన్నికలు జరగ్గా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితం ఇప్పటికే దాదాపు స్పష్టం. ప్రతిపక్షం కుట్రలు భగ్నం కావడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు ప్రకటన లాంఛనప్రాయమే. మిగిలిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ ఎన్నికలు ఓటింగ్, కౌంటింగ్ ప్రక్రియ సంక్లిష్టంగా ఉన్నందున తుది ఫలితం రావడం ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

- పట్టభద్రుల స్థానంపైనే అందరి చూపు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక దాదాపు ఏకపక్షమే
- ఇండిపెండెంట్ అభ్యర్థికి దెబ్బకొట్టిన తోటి టీడీపీ నాయకులు
- నేడే కౌంటింగ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శాసనమండలి స్థానాల ఎన్నికల ఫలితాలు గురువారం వెల్లడి కానున్నాయి. ఈ నెల 13న పోలైన ఓట్ల లెక్కింపు నేడు జరగనుంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కౌంటింగ్ శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాలలో, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితాలు ముందుగా వెల్లడవుతాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఒక అభ్యర్థికి పూర్తి మెజార్టీ వస్తే ఫలితం వేగంగా రానుంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళ్తే సమయం పట్టే అవకాశం ఉంది.

ఏకపక్షంగానే...

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం దాదాపు ఏకపక్షం కానుంది. నామినేషన్ల సమయంలో మ్యాజిక్ చేస్తాం.. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల మద్దతు తనకుంటుందని హడావుడి చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి ఆనెపు రామకృష్ణ చివరికొచ్చేసరికి చతికిలపడ్డారు. సామాజికవర్గం పేరుతో ఏదో చేద్దామనుకున్నా కుదరలేదు. తన సొంత పార్టీ టీడీపీ నాయకులనుంచే మద్దతు దొరకలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు విజయం నల్లేరుపై నడకగా మారింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి 776 ఓట్లు ఉండగా 752ఓట్లు పోలయ్యాయి. టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు కూడా పోలింగ్‌కు దూరంగా ఉండిపోయారు. చెప్పాలంటే టీడీపీపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీ నుంచి కొన్ని ఓట్లు తనవైపు తిప్పుకుందామనే వ్యూహంతో ఇండిపెండెంట్ అభ్యర్థి బరిలో నిలబడ్డారు. కానీ, సొంత పార్టీ నుంచే తనకు మద్దతు, ఆదరణ కొరవడంతో ఏమీ చేయలేక ఎన్నికల రోజున చేతులెత్తేశారు. ఫలితంగా గురువారం జరిగే కౌంటింగ్‌లో స్థానిక సంస్థల ఫలితం వేగంగా, ఏకపక్షంగా రానుంది.



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాక్ కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్, అధికారులు

ఆసక్తి రేపుతున్న పట్టభద్రుల పోలింగ్..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ఆసక్తికరంగా జరిగింది. ఐదు జిల్లాల పరిధిలో 2,82,914 ఓట్లకు గాను 2,00,926 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 69.47 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 72.05 శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 73.54 శాతం, విజయనగరం జిల్లాలో 75.18 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 72.56 శాతం, అనకాపల్లి జిల్లాలో 73.80 శాతం, విశాఖ జిల్లాలో 62.24 శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా విజయనగరం జిల్లాలో, అత్యల్పంగా విశాఖ జిల్లాలో ఓటింగ్ జరగడంతో ఈ పోలింగ్ ఎవరి కొంప ముంచుతుందోనన్న భయం అందరిలోనూ ఉంది. అత్యధిక ఓట్లు ఉన్న విశాఖపట్నంలో తక్కువ పోలవడం ఏ అభ్యర్థికి మైనస్ అవుతుందో చెప్పలేని పరిస్థితి. పోలింగ్ సరళిపై ఆయా అభ్యర్థులు రెండు రోజులుగా విశ్లేషణ చేసుకున్నారు. తమదంటే తమదే విజయమని చెప్పుకుంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో మెజార్టీ సాధిస్తే వేగంగా ఫలితం వస్తుంది. రెండో ప్రాధాన్యత ఓటుకు వెళ్తే ఫలితం వచ్చేసరికి ఫలితం రావడానికి ఆలస్యమవుతుంది. అది ఎంత సమయం అవుతుందో.. ఎప్పటికీ కౌంటింగ్ పూర్తవుతుందో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.

సిక్కోలు ఓటు ఎవరికో..

శ్రీకాకుళం జిల్లాలో 52,256 ఓట్లు ఉండగా 37,653 ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో అత్యధికంగా ఎల్ఎన్‌పేటలో 28వ పోలింగ్ స్టేషన్‌లో 83.27శాతం, పోలాకిలోని 30వ పోలింగ్ స్టేషన్‌లో 81.07శాతం పోలవ్వగా, ఆ తర్వాత మందసలోని 11వ పోలింగ్ స్టేషన్‌లో 79.52 శాతం, ఆమదాలవలసలోని 43ఎ పోలింగ్ స్టేషన్‌లో 79.39 శాతం, రణస్థలంలోని 66వ పోలింగ్ స్టేషన్‌లో 78.72 శాతం, పలాసలోని 9వ పోలింగ్ స్టేషన్‌లో 78.44 శాతం, ఇచ్ఛాపురంలోని14వ పోలింగ్ స్టేషన్‌లో 77.09 శాతం, కోటబొమ్మాళిలోని 33వ పోలింగ్ స్టేషన్‌లో 76.88 శాతం, వజ్రపుకొత్తూరులోని 20వ పోలింగ్ స్టేషన్‌లో 76.50 శాతం ఓట్లు నమోదయ్యాయి. అత్యల్పంగా ఎచ్చెర్లలోని 68వ పోలింగ్ స్టేషన్‌లో 50.75శాతం నమోదవ్వగా, ఆ తర్వాత శ్రీకాకుళంలోని 61వ పోలింగ్ స్టేషన్‌లో 62.83 శాతం, 57వ పోలింగ్ స్టేషన్‌లో 63.24 శాతం, కొత్తూరులోని 4వ పోలింగ్ స్టేషన్‌లో 63.87 శాతం, నందిగాంలోని 21వ పోలింగ్ స్టేషన్‌లో 64.93 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గాల వారీగా చూస్తే శ్రీకాకుళంలో అత్యల్పంగా ఓటింగ్ జరిగింది. గార మినహాయిస్తే టౌన్‌లో 10 పోలింగ్ స్టేషన్‌లలో 66.95 శాతం నమోదైంది.

పక్కాగా 'స్థానిక' కౌంటింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో బుధవారం మాక్ కౌంటింగ్ నిర్వహించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. అనంతరం జరిగిన సమీక్షలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయని చెప్పారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు తెరవడం, చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్ల విభజన, కట్టలు కట్టడం, లెక్కింపు కీలకమని చెప్పారు. గార తహసీల్దార్, మాస్టర్ ట్రైనర్ సనపల సుధాసాగర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి కౌంటింగ్ చేపట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.శాంతి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న 'ఆస్కార్'



సుద్దముక్కపై ఆస్కార్ ప్రతిమ

తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస సమీపంలోని సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన సైకతశిల్పం విశేషంగా ఆకట్టుకుంటోంది. అదే విధంగా, కాశీబుగ్గకు చెందిన కొత్తపల్లి రమేష్ ఆచారి సుద్దముక్కపై ఆస్కార్ ప్రతిమ చెక్కి అబ్బురపరిచారు.

– ఆమదాలవలస రూరల్/కాశీబుగ్గ



గేదెల హరికృష్ణ వేసిన నాటు నాటు సైకతశిల్పం

జయహో.. నూకాంబిక



శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లి వీధిలో నూకాంబిక అమ్మవారి సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శూలాలతో నిర్వహించిన తిరువీధి ప్రదర్శన ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఆప్కోలో క్లియరెన్స్ సేల్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై ఆకర్షణీయమైన రాయితీలు (1+1, 1+2), ప్రత్యేక తగ్గింపుతో క్లియరెన్స్ సేల్స్ కౌంటర్ నిర్వహిస్తున్నట్లు డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ పి.సోమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అంబేడ్కర్ కూడలి వద్ద నేత బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఆప్కో షోరూమ్‌లో విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ జరీ చీరలు, బందరు, మంగళగిరి, రాజమండ్రి ప్రింటెడ్ కాటన్ డ్రెస్ మెటీరియల్స్, ప్రింటెడ్ బెడ్ షీట్స్, దుప్పట్లు, దోమ తెరలు, లుంగీలు, టవల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పోలీసు కుటుంబాలకు భరోసా



చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : పోలాకి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వి.మహదేవన్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు విభాగం స్వీపర్ కె.అరుణకుమారిలు అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబసభ్యులకు విడోఫండ్, స్లాగ్ ఫండ్ కింద రూ.75 వేలు చొప్పున చెక్కులను ఎస్పీ రాధిక మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

- మొదలైన ఇంటర్మీడియెట్ పరీక్షలు
- తొలిరోజు 924 మంది గైర్హాజరు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థిని

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు సెట్–1 ప్రశ్నపత్రంతో తెలుగు, సంస్కృతం, హిందీ, ఒరియా పేపర్లు రాశారు. 109 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు తొలిరోజు 26,693 మంది విద్యార్థులకు గాను 25,769 మంది హాజరయ్యారు. 924 మంది గైర్హాజరయ్యారు. గురువారం నుంచి ఇంటర్ సెకెండియర్ పరీక్షలు మొదలు కానున్నాయి. కాగా, పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక, అధికారులు పరిశీలించారు. 144 సెక్షన్ అమలును పక్కాగా అమలు చేయాలని పోలీసులకు ఆదేశించారు. డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు పలు కేంద్రాలను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు ఆకస్మిక తనిఖీలు చేశాయి. తొలిరోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు.

విలపించిన విద్యార్థిని..

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పరీక్ష కేంద్రానికి వచ్చిన సంతబొమ్మాళి కేజీబీవీ ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థిని పందిరి శ్రావణి విషయంలో కాసేపు గందరగోళం నెలకొంది. ఈమె మానసిక దివ్యాంగురాలు కావడంతో టెన్త్‌లో సహాయకురాలి సాయంతో పరీక్ష రాసింది. ఇంటర్‌లోనూ అదే విధంగా సహాయకురాలిని నియమించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాత కోరగా పరీక్ష కేంద్రం అధికారులు తిరస్కరించారు. అనుమతి పత్రం లేనిదే తామేమీ చేయలేమని చెప్పడంతో శ్రావణి విలపిస్తూనే పరీక్ష రాసింది.



విలపిస్తూ పరీక్ష రాస్తున్న శ్రావణి



శ్రీకాకుళం ఆర్‌సీఎం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

క్లుప్తంగా

యోగా పీజీ డిప్లమోలో ప్రవేశాల గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో యోగా పీజీ డిప్లమోలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. యోగా, ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మార్చి 15తో దరఖాస్తు స్వీకరణ గడువు ముగియగా, ఏప్రిల్ 3 వరకు పెంచినట్లు పేర్కొన్నారు. డిగ్రీ విద్యార్హత ఉండాలని తెలిపారు. రూ.10 వేలు ట్యూషన్ ఫీజుకాగా, దరఖాస్తుకు రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఆర్‌బీఆర్ఏయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌ను గానీ, యోగా కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వి.అరుణ (9490677790)ను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడో సెమిస్టర్‌కు సంబంధించి రెగ్యులర్, సప్లిమెంటరీ, ఐదో సెమిస్టర్‌కు సంబంధించి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 29 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఐదో సెమిస్టర్ 20 పరీక్ష కేంద్రాల్లో ఉదయం పూట, మూడో సెమిస్టర్ 66 పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు. ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు.

మరో ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం బీసీ బాలుర వసతిగృహంలో రెండు రోజులుగా 41 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందిన తెలిసిందే. వీరిలో మంగళవారం 32 మంది డిశ్చార్జ్ అయి వసతి గృహానికి వెళ్లారు. మిగిలిన 9 మంది బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఇంతలోనే మరో ఐదుగురు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ తులసి సమీక్షించారు. వసతి గృహంలో క్లోరినేషన్ చర్యలు చేపట్టి విద్యార్థులకు తేలికపాటి ఆహారం, వేడి నీటి సదుపాయం కల్పించాలని వార్డెన్ టి.అప్పారావును ఆదేశించారు.

ఆరా తీసిన సబ్ కలెక్టర్ ...

టెక్కలి: పోలవరం బీసీ బాలుర వసతి గృహాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయనతో పాటు తహసీల్దారు కిషోర్ ఉన్నారు. టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా వసతి గృహాన్ని సందర్శించారు. వార్డెన్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పాడుగుపాడులో చైన్ స్నాచింగ్

కోటబొమ్మాళి: మండలంలోని పాడుగుపాడుకు చెందిన బెండి అన్నపూర్ణ మెడలో తులమున్నర పుస్తెలతాడు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తెంచుకుపోయారు. అన్నపూర్ణ తన భర్త సింహాచలంతో కలిసి బైక్‌పై కోటబొమ్మాళిలో ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా 8.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి పుస్తెలతాడు తెంచుకుపోయారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

న్యాయ కళాశాలకు
బీసీఐ గుర్తింపు



బీసీఐ గుర్తింపు పత్రాన్ని న్యాయ విభాగ బోధన సిబ్బందికి అందజేస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

- బీఆర్ఏయూ లా కాలేజీలో ప్రవేశాలకు తొలగిన అడ్డంకి
- 60 సీట్లు భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు
- స్పాట్ అడ్మిషన్లు కల్పించేందుకు ప్రయత్నాలు

ఎచ్చెర్ల క్యాంపస్:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మహాత్మా జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రవేశాలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగిపోయాయి. న్యూఢిల్లీకి చెందిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) తాజాగా గుర్తింపు పత్రం మంజూరు చేసింది. దీంతో తక్షణ ప్రవేశాలకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. 2023 –24 ఏడాదికి గాను బీసీఐ గుర్తింపు లేక ప్రవేశాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీఐ గుర్తింపు కోసం వర్సిటీ అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. కమిటీ సందర్శన కోసం రూ.8.50 లక్షల మేర డీడీ చెల్లించారు. గుర్తింపు అవసరాన్ని బీసీఐ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రైవేట్ కళాశాలలకు గుర్తింపు ఉండి, ప్రభుత్వ విశ్వవిద్యాలయానికి లేకపోవడాన్ని సైతం ప్రస్తావించారు. బీసీఐ బృందం ఫిబ్రవరి 3న వర్చువల్‌గా తనిఖీ చేసి అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలని సూచించింది. వారు సూచనల మేరకు అధికారులు పత్రాలు సమర్పించారు. మార్చి 6న బీసీఐ బృందం సమావేశమై లా కాలేజీకి గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 13న గుర్తింపు మంజూరు చేశారు. అనంతరం ఆన్‌లైన్‌లో వర్సిటీకి పంపించారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని న్యాయ కళాశాలకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు బుధవారం అందజేశారు.

షరతులతో కూడిన అనుమతులు..

బీసీఐ షరతులతో కూడిన అనుమతులను న్యాయ కళాశాలకు మంజూరు చేసింది. వారు సూచించిన లోపాలను అధిగమించాల్సి ఉంటుంది. 2011 నుంచి బీసీఐ నిబంధనలు కళాశాలలో పాటించకపోవటం వల్లే గుర్తింపు రద్దు చేసినట్లు వివరించింది. వర్సిటీ మరో రూ.15 లక్షలు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. భవిష్యత్తులో కనీసం ఇద్దరు రెగ్యులర్ బోధకులను నియమించాలని, 40:1 ప్రకారం అర్హులైన బోధకులు ఉండాలని, ఒక సెక్షన్ 60 సీట్లు నిర్వహించాలని, మూట్ కోర్టు మార్పు చేయాలని, అర్హత గల ప్రిన్సిపాల్, లైబ్రేరియన్ ఉండాలని, కోర్టు అబ్జర్వేషన్‌లో ఇంటర్న్‌షిప్ పక్కాగా చేయించాలని, లీగల్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించి ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు ఇవ్వాలని, ప్రస్తుతం అమలు చేస్తున్న సిలబస్‌లో మార్పులు తీసుకురావాలని, సెమిస్టర్ విధానంలో క్లాస్ వర్కు నిర్వహించాలని సూచించింది. ఇవేవి పాటించకపోయినా, నిర్వహణలో లోపాలు ఉన్నా గుర్తింపు నిలుపుదల చేస్తామని స్పష్టం చేసింది. ప్రస్తుతం బీసీఐ గుర్తించిన లోపాలపై వర్సిటీ అధికారులు అఫిడవిట్లు సమర్పిస్తున్నారు.



అంబేడ్కర్ వర్సిటీలోని మహాత్మా జ్యోతీరావు పూలే న్యాయ కళాశాల

ప్రవేశాలకు మార్గం సుగమం..

ఈ ఏడాది న్యాయ విద్య ప్రవేశాలను బీసీఐ గుర్తింపు లేని కారణంగా నిలిచిపోయాయి. తాజాగా గుర్తింపు రావడంతో తక్షణ ప్రవేశాలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే లాసెట్ – 2022 ప్రవేశాలు కౌన్సెలింగ్ రెండు విడతలు పూర్తయ్యాయి. లాసెట్ ర్యాంకు ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వర్తిస్తాయి. తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు)కు ప్రభుత్వ రాయితీలు వర్తించవు. అయితే ఆసక్తి ఉన్న వారు, ప్రభుత్వ రాయితీలపై ఆధారపడని వారు ప్రవేశాలు పొందవచ్చు. ఈ మేరకు అధికారులు స్పాట్ అడ్మిషన్ల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి కోరారు. అయితే విశ్వవిద్యాలయాల్లో సెట్ ర్యాంకు లేని వారికి స్పాట్ అడ్మిషన్లు ఇవ్వటం లేదు. ఎడ్‌సెట్, పీజీ సెట్, ఐసెట్, ఎంసెట్.. ఇలా ర్యాంకు ఉన్న వారికి మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అవకాశమిచ్చారు. లాసెట్ విషయంలో ఈ నిబంధన తప్పనిసరి చేస్తారా? ర్యాంకుతో సంబంధం లేకుండా ప్రవేశాలకు అవకాశం ఇస్తారా? అన్న అంశంపై త్వరలో స్పష్టత రానుంది.

స్పాట్ అడ్మిషన్లకు ప్రయత్నిస్తున్నాం..

బీసీఐ గుర్తింపు రావటంతో 60 సీట్లతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు నిర్వహిస్తాం. ఈ ఏడాది లాసెట్ కౌన్సెలింగ్‌లో కళాశాలకు అనుమతులు లేకపోవటం వల్ల ప్రవేశాలు జరగలేదు. ప్రస్తుతం స్పాట్ అడ్మిషన్ల కోసం ప్రయత్నిస్తున్నాం. ఉన్నత విద్యా మండలి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాం. వచ్చిన వెంటనే ప్రవేశాలు నిర్వహిస్తాం. బీసీఐ గుర్తించిన లోపాలపై ప్రత్యేక దృష్టిపెడతాం.

– ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పలాస మండలం రెంటికోటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నందపూరి లబ్బో(50) స్పీడ్ బ్రేకర్ వద్ద రోడ్డు దాటుతుండగా పలాస ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ గమనించక ఢీకొట్టాడు. తలమీదుగా బస్సు వెళ్లడంతో లబ్బో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భార్య లొక్కిమి, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన బస్సు

శ్రీముఖలింగంలో హుండీ లెక్కింపు వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా పడినట్లు ఈఓ పి.ప్రభాకరరావు గురువారం తెలిపారు. వాస్తవంగా హుండీ లెక్కింపు శివరాత్రి ఉత్సవాల అనంతరం జరగాలి. సాంకేతిక కారణాలు వల్ల ఈ నెల 2న లెక్కిస్తామని చెప్పిన అధికారులు ఈ నెల 15 నాటికి వాయిదా వేశారు. తాజాగా మరోసారి వాయిదా వేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

నీట్ పీజీలో మెరిశారు



నవగాన నీలిమ (660వ ర్యాంకు)



నవగాన కిరణ్ (8,200వ ర్యాంకు)



సురవరపు అనూష (6567వ ర్యాంకు)

పాతపట్నం/మెళియాపుట్టి/హిరమండలం: మెళియాపుట్టి మండలం సుందరాడ గ్రామానికి చెందిన అన్నాచెల్లెల్లు నివగాన కిరణ్, నివగాన నీలిమ నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. నీలిమ 660వ ర్యాంకు, కిరణ్ ఆలిండియా 8200వ ర్యాంకుతో సత్తాచాటారు. తండ్రి నవగాన పాపారావు పాతపట్నం మండలం కొదూరు గ్రామ పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. తల్లి జయమ్మ గృహిణి. ఒకె ఇంట్లో అన్నాచెల్లెలు మంచి ర్యాంకులు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంశధార నిర్వాసిత గ్రామమైన (పాడలి) సుభలయ ఆర్‌అండ్ఆర్ కాలనీకి చెందిన సురవరపు అనూష ఆలిండియా 6567వ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు భాస్కరరావు, జమునారాణి హర్షం వ్యక్తం చేశారు.

మలేషియా నుంచి స్వగ్రామానికి విజయకుమార్ మృతదేహం

నరసన్నపేట:

ఉపాధి కోసం మలేషియా వెళ్లి ఆత్మహత్య చేసుకున్న బడ్డ విజయకుమార్ మృతదేహం ఎట్టకేలకు బుధవారం సాయంత్రం స్వగ్రామం బాలసీమకు చేరింది. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆరు నెలల క్రితం మలేషియా వెళ్లిన విజయకుమార్ ఈ నెల 3న అక్కడ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి తల్లిదండ్రులు కొండాలమ్మ, వెంకటరమణలు కుమారుడు చివరి చూపు కోసం ఎదురు చూశారు. పేదరికం కావడంతో మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్నేహితులు విరాళాలు సేకరించి మృతదేహాన్ని రప్పించారు. మలేషియాలో ఉన్న తెలుగు వారు కూడా కొంత వరకూ సహకరించారని తండ్రి వెంకటమణ తెలిపారు. హైదరాబాద్‌కు బుధవారం వేకువజామున విమానంలో మృత దేహం రాగా, అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు స్వగ్రామం వచ్చింది. కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తీరప్రాంతాల్లో వాచ్‌టవర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- ప్రమాద స్థలాల్లో హెచ్చరిక బోర్డులు
- తీరప్రాంత భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తీర ప్రాంతంలో వాచ్ టవర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసేందుకు సంబంధిత తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా స్థాయి తీరప్రాంత భద్రతా కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంచినీళ్లపేట, రాజారాంపురం, మొగదాలపాడు, పీజీపేట, ఇందువానిపేట, బారువ, కొత్తఊరు తదితర ప్రాంతాల్లో వాచ్ టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రమాద స్థలాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు అవసరమైన నిధుల వివరాలు తెలియజేస్తే వాటిని జిల్లా నిధుల నుంచి మంజూరుచేస్తామని చెప్పారు. సముద్రతీర ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకోసం ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని సభ్యులు కోరగా మత్స్యశాఖలో ఈతగాళ్లు ఉంటారని, కావున వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సముద్రపు వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీచేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకువెళ్లడంలేదని తెలియజేయడంతో.. అటువంటి వారి నుంచి సాధారణ రుసుం వసూలుచేయాలని, తద్వారా కార్డులపై మత్స్యకారుల్లో అవగాహన కలుగుతుందన్నారు. మత్స్య శాఖ గుర్తింపు పొందని బోట్లు 11 మండలాల్లో 43 ఉన్నాయని, వాటికి రిజిస్ట్రేషన్ చేసుకుంటే నంబర్ కేటాయిస్తామని మత్స్య శాఖ ఉప సంచాలకులు తెలిపారు. వేటకు వెళ్లే వారిలో చిన్నపిల్లలు కూడా ఉంటున్నారని సభ్యులు తెలియజేయగా.. గ్రామప్రజల సహకారంతో సాగరిక సంస్థ ద్వారా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వారిని బడికి పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలర్ట్ ట్రాన్స్‌మీటర్స్ మత్స్యకారుల వద్ద లేనందున ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలియజేయగా.. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు, కలర్ కోడ్ తప్పనిసరి చేసినట్లు మెరైన్ పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.రాము, కస్టమ్స్ ప్రివెంటివ్ యూనిట్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, ఇండియన్ కోస్ట్ గార్డు అధికారి ఎస్.ఎం.బాషా, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ జి.బి.ఆర్.మధుసూదనరావు, మెరైన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఐబీ జేడీడీ కె.గణేషన్, డీసీఐఓ పి.కె.మహాపాత్ర, మత్స్యశాఖ ఉపసంచాలకుడు పి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు లేకపోతే ప్రశ్నించే హక్కు ఉండదు



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్

- మోసాలపై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1967
- వినియోగదారుల దినోత్సవంలో పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో అందరూ వినియోగదారులేనని, ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలు గుర్తెరగాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పౌర సరఫరాలు, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. బిల్లు లేకపోతే ప్రశ్నించే హక్కు ఉండదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మోసాలను అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులతో వినియోగదారుల క్లబ్బులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఇందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రామీణ, మండలస్థాయిలో ఉన్న క్లబ్బులను మరింత పటిష్టం చేస్తామన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం 1967 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ఈ ఏడాది స్వచ్ఛమైన ఇంధన పరివర్తన ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం అనే నినాదంతో వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మొదటి దశగా 50 సచివాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశామన్నారు.
- జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు రఘుపాత్రుని చిరంజీవి మాట్లాడుతూ శిలాజ ఇంధనాల వల్ల పర్యావరణం కలుషితమవుతోందని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన నీరు, గాలి, సూర్యరశ్మి, సముద్రతరంగాల శక్తి, భూతాప శక్తి, జీవశక్తిపై దృష్టి సారించాల్సిన అవసరం వచ్చిందని, ఈ ఏడాది నినాదం ఉద్దేశం ఇదేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యులు బగాది రామ్మోహన్‌రావు, జి.రాధారాణి, షణ్ముఖరావు, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డా. డి.వి.విద్యాసాగర్, డీఈఓజి.పగడాలమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు, ఫోరం సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికలకు నామినేషన్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గం (2023–24) ఎన్నికకు బుధవారం నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ నెల 31న జరిగే ఎన్నికకు అధ్యక్ష పదవికి కూన రాజారావు, ఎన్ని సూర్యారావు, శిస్టు రమేష్, కర్రి శేషగిరిరావు నామినేషన్లు వేశారు. ఉపాధ్యక్ష పదవికి గొంటు చంద్రమోహన్, ఎస్.బలరాంశేఖర్, ప్రధాన కార్యదర్శి పదవికి పొన్నాడ రాము, పైడి రామారావు, దుంపల రామణరావు, ఇప్పిలి సీతరాజు, కార్యదర్శి పదవికి ఎస్.చిన్నారావు, సూర వేణుగోపాలరావు, తాండ్ర గోవిందరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి గంగుల భాస్కరరావు, కోశాధికారి పదవికి ఎ.లక్ష్మీనారాయణ, మహిళా ప్రతినిధిగా వి.హరిప్రియ, లైబ్రరీ సెక్రటరీ పదవికి భవానీ ప్రసాద్ పోటీలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 17వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉంది. ఎన్నికల అధికారిగా జె.తిరుపతిరావు వ్యవహరిస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



శివ(ఫైల్)

నరసన్నపేట: స్థానిక బజారువీధిలో నివాసముంటున్న పాయకరావుపేటకు చెందిన దక్కుబల్లి శివ (35) అనుమానాస్పదంగా మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టడం వలన శివ మృతి చెందాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట నుంచి నరసన్నపేటకు 15 ఏళ్ల క్రితం వలస వచ్చిన శివ తునికి చెందిన బంగారి సత్యవతితో సహజీవనం చేస్తూ బజారు వీధిలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 12న తీవ్ర గాయాలతో ఇంటికి రాగా సత్యవతి స్థానికుల సహాయంతో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించింది. పరిస్థితి విషమించడంతో ఈ నెల 13న శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాగా, శివ స్నేహితులు మాత్రం ఇది హత్యేనని, కేసు దర్యాప్తు చేసి నిందితులను గుర్తించాలని కోరుతున్నారు. శివ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215